ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కుమరం భీం
జిల్లా వార్తలు
8
గురువారం 20 నవంబరు 2025

- జిల్లాలో రికార్డు స్థాయిలో పడిపోయిన ఉష్ణోగ్రతలు
- గిన్నెధరిలో అత్యల్పంగా 7.9 డిగ్రీలు
- నెగళ్లతో ఉపశమనం పొందుతున్న ప్రజలు
- వృద్ధులు, చిన్నారుల తీవ్ర అవస్థలు

వామ్మో చలి



తిర్యాణి మండలంలో కమ్మేసిన పొగమంచు

ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో చలి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు ఒక్క సారిగా పడి పోవడంతో ప్రజలు ఉక్కిరి బిక్కిరవుతున్నారు. బుధవారం జిల్లాలోని తిర్యాణి మండలంలోని గిన్నెధరి గ్రామంలో రాష్ట్రంలోనే అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రతకు పడిపోయాయి. దీనికి తోడు గ్రామాల్లో పొగమంచు కమ్మేస్తోంది. చలికి ఏజెన్సీ మండలాలు గజగజ వణికిపోతున్నాయి. చిన్నారులు, వృద్ధులు చలి నుంచి రక్షణ పొందేందుకు నానా తంటాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. సాయంత్రం ఐదు గంటలు దాటితే జనాలు బయటికి వెళ్లనంత చలి తీవ్రత పెరగడంతో ఆసిఫాబాద్ ప్రాంతంలో జనజీవనం స్తంభిస్తోంది. ముఖ్యంగా అడవులు అధికంగా ఉన్న మండలాలైన తిర్యాణి, కెరమెరి, జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్, బెజ్జూరు, చింతలమానెపల్లి, పెంచికలపేట, దహెగాం, కౌటాల, సిర్పూర్(టి), ఆసిఫాబాద్ ప్రాం తాల ప్రజలు చలి నుంచి రక్షణ పొందేందుకు షటర్లు, జర్కిన్‌లు ధరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు చీకటైతే చాలు ఇళ్ల ముందు నెగళ్లు ఏర్పాటు చేసుకుని కాలం వెళ్లదీస్తున్నారు. చలితీవ్రత గతంలో ఎప్పుడు లేనంతగా కనిపిస్తుండడంతో రానున్న రోజుల్లో ఈ తీవ్రత ఏ స్థాయిలో ఉంటుందోనన్న ఆందోళన జిల్లా వాసుల్లో వ్యక్తమవుతోంది. నిజానికి ఆసిఫాబాద్ ప్రాంతంలో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. కానీ ఈ సారి సీజన్ లో కూడా చలి పంజా విసురుతుండడంతో జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్ డివిజన్ కేంద్రం చీకటి పడితే చాలు జనాలు లేక బోసిపోతోంది. ఉదయం 9 గంటలు దాటితే కానీ ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నారు. తెల్లవారు లేవగానే పొలం పనులకు వెళ్లె రైతులు, పాలు పోసే వ్యాపారులు, పేపర్ బాయ్స్, వాకర్స్ చలి బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలి తీవ్రత ఒక్కసారిగా పెరగడంతో వైద్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. వృద్ధులు, చిన్నారులు రక్షణ లేకుండా చలిలో బయటకు వెళ్లితే శ్వాస కోస సంబంధిత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

ఏజెన్సీ మండలాల్లో ఇబ్బందులు..

జిల్లాలోని ఏజెన్సీ మండలాల్లో చలి తీవ్రతకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తిర్యాణి మండలం గిన్నెధరిలో అత్యల్పంగా 7.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోనే అత్యల్పంగా గిన్నెధరిలో నమోదైంది. జిల్లా వ్యాప్తంగా ఏజెన్సీ మండలాలు చలికి వణికి పోతున్నాయి.

కెరమెరిలో 8.8, సిర్పూర్ (యు)లో 10.3, వాంకిడిలో 11.1 డిగ్రీలు అత్యల్పంగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. చలి తీవ్రత పెరగడంతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ పట్టణాలతో పాటు ఆయా మండల కేంద్రాల్లో షెటర్లు, జర్కిన్‌లకు గిరాకీ పెరిగింది. ఒక్క సారిగా ఉష్ణోగ్రతలు పడిపోవడంతో చలి తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శరీ రక్షణ కోసం షెటర్లు, జర్కిన్‌లు, మఫ్లర్లు, చేతి తొడుగులు తదితరాల కొనుగోలు చేపడుతున్నారు. దీంతో ఒక్క సారిగా ఉన్ని దుస్తుల గిరాకీ పెరిగింది.

ఐదు రోజులుగా నమోదైన ఉష్ణోగ్రతలు..

తేదీ	గరిష్ఠ	కనిష్ఠ
15	31.6	8.4
16	32.4	7.4
17	29.8	7.0
18	31.0	6.8
19	32.1	7.9

ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో చలి విజృంభిస్తున్నది. ఉష్ణోగ్రతలు, ఒక్కసారిగా పడిపోవడంతో జిల్లా ప్రజలు చలికి వణికిపోతున్నారు. పగలంతా వేడిమి ఉంటున్నా సాయంత్రం ఐదు గంటలు దాటితే చలి తీవ్రత పెరిగిపోవడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలి



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆటగాళ్లు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. స్థానిక క్రీడా పాఠశాల ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన ఆశ్రమ పాఠశాలల క్రీడా పోటీలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో ఆడాలని అన్నారు. ఆసిఫాబాద్, జైనూరు, కాగజ్‌నగర్, మంచిర్యాలలోని ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న క్రీడాకారులకు ఎనిమిది అంశాలలో క్రీడా పోటీలు నిర్వహించారు. ఇందులో దాదాపు 800 మంది క్రీడాకారులు 100 ఎస్కార్ట్, పీడీ, పీఈటీలు పాల్గొని ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. అంతకు ముందు విద్యార్థులచేత గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి, పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, ఏసీఎంవోలు ఉద్దవ్, లక్కయ్య, ఏటీడీవోలు శివకృష్ణ, శ్రీనివాస్, సురేష్, శ్రీనివాస్, క్రీడాధికారులు శేషు, జీవరత్నం, మీనారెడ్డి, జీసీడీవో శకుంతల, టీడబ్ల్యూటీయూ నాయకులు కృష్ణరావ్, గోపాల్, రవీందర్, శైలజ, అనంత్, పీడీలు మధు, వెంకటేష్, రవీందర్, సుభాష్, శ్రీనివాస్, విద్యాసాగర్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

ఝూన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వీరనారి ఝూన్సీ లక్ష్మీబాయి జయంతి సందర్భంగా బుధవారం బీజేపీ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావు, మాజీ ఎంపీపీ మల్లికార్జున్, ప్రసాద్‌గౌడ్, కిరణ్, సంతోష్, శ్రీశైలం, కోటేష్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



వాంకిడిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు

వాంకిడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఇందిరాగాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్ అమలు చేసున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా చూస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్నులే నారాయణ, దుర్గం ప్రశాంత్, జాబిరె గణేష్, దాదాజీ, అనిల్, పెంటు, జమాల్‌పూరి సుధాకర్, శివాజీ, జైరాం, సోము పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీచైర్మన్ కుడిమెత విశ్వనాథ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకీద్, ఉపాధ్యక్షుడు పెందుర్ ప్రకాష్, మేస్రాం అంబాజీ, కనక గంగారాం, డైరెక్టర్ పంద్ర షేకు, మడావి క్రిష్ణ, అజ్జు లాల, షేక్‌అంజద్, రహీం పాల్గొన్నారు.

అలరించిన కార్తీక దీపోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక దీపోత్సవ వేడుకలు అలరించాయి. మంచిర్యాల జిల్లా లక్షెటిపేటకు చెందిన ప్రణవ్‌శర్మ ఆధ్వర్యంలో 18 మంది వేద పండితులు ప్రత్యేక శివ లింగార్చన, గణపతి పూజ చేపట్టడంతో పాటు దీపార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి-సోనేరావు దంపతులతో పాటు తనయుడు సాయినాథ్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజ కవర్గ ప్రజల సంక్షేమం కోసం కార్తీక దిపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించామని చెప్పారు. ఈ దీపార్చన కార్యక్రమంలో పట్టణంలోని అయా కాలనీలకు చెందిన మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున హజరై కార్తీక దీపాలు వెలిగిం చారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సంగీత విభావరి భక్తి పాటలను అలపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మర్సుకోల సరస్వతి, బుర్స పోచయ్య, గంధం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు చేయూతనిస్తాం



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

దహెగాం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రైతులకు చేయూతనిస్తామని సిర్పూర్ నియోజకవర్గ ఆత్మ(అగ్రికల్చర్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) కమిటీ చైర్మన్ తాల్లపల్లి రామారావు అన్నారు. సిర్పూర్ నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్‌గా దహెగాం మాజీ జడ్పీటీసీ తాల్లపల్లి రామారావుకు ఎమ్మెల్సీ దండె విఠల్ బుధవారం నియామక పత్రాన్ని అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో గజ్జి రామయ్య, భీమన్న, రమేశ్ సోహెల్ అహ్మద్, సత్యనారాయణ, మహేష్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీ ఆపరేటర్లకు పదోన్నతి పరీక్ష

రెబ్బెన, నంబరు 19 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో ఖైరిగూడ ఓసీ ఆపరేటర్లను బుధవారం పదోన్నతి కోసం ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. డి గ్రేడ్ నుంచి సీ గ్రేడ్ పదోన్నతి కోసం 9 మంది సీ గ్రేడ్ నుంచి బి గ్రేడ్ పదోన్నతి కోసం 38 మంది ఈపీ ఆపరేటర్లు పరీక్షలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమలో సెలెక్షన్ కమిటీ చైర్మన్, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, కార్పొరేట్ మెంబర్ అనీల్‌కుమార్, ప్రాజెక్టు ఇంజనీర్ వీరన్న పర్సనల్ హెచ్‌ఓడీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా చీరల పంపిణీ



వీసీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా

ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో చీరల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఏకరూప చీరల పంపిణీపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు అనసూయ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణరావు, సెర్ప్ సీఈవో దివ్యదేవరాజన్‌తో కలిసి కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి అధికారులు, సెర్ప్ అధికారులు, జిల్లా, మండల మహిళా సమాఖ్య ప్రతినిదులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఈ నెల 19 నుంచి డిసెంబరు 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్ల వయస్సు నిండిన ప్రతీమహిళకు పారదర్శకంగా చీరల పంపిణీ చేయాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించి పండగ వాతావరణంలో చీరల పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ సముదాయంలోని వీసీ హాల్ నుంచి కలెక్టర్ వెంకటేష్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, డేవిడ్, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధశుక్లా, గ్రామీణాభివృద్ధి అధికారులు, జిల్లా మండల సమాఖ్య సభ్యులు, ఐకేపీ ఏపీఎంలు, డీపీఎంలతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఇప్పటి వరకు 35,758 ఏకరూప చీరలు వచ్చాయని చెప్పారు. డిసెంబరు 9 వరకు ఇందిరమ్మ జయంతి సందర్భంగా మహిళల ఉన్నతి, తెలంగాణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో చీరల పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. నియోజక వర్గానికి నోడల్ అధికారిగా కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి నోడల్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారని చెప్పారు. ప్రతి మండలానికి ప్రత్యేకాధికారుల ద్వారా గ్రామ సమాఖ్య సభ్యుల భాగస్వామ్యంతో చీరల పంపిణీ చేపడుతామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. సమావేశంలో జిల్లా మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు శ్రీదేవి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, పంచాయతీ అధికారి భిక్షపతి, స్పెషల్ కలెక్టర్ జాస్టిన్‌జోల్ తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నిరుపేదల కోసం ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పనులన లబ్ధిదారులు వేగవేంతంగా పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి బుధవారం మండల పరిషత్ అధికారులు, ఎంపీవోలు, ఏపీవోలు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. ప్రధాన మంత్రి జన్ మన్ పథకం కింద పీవీటీజీలకు మంజూరు చేసిన ఇళ్ల పనులను వంద శాతం ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ఇందరిమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తుందని చెప్పారు. సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులు ఇసుకను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి పనులకు వంద శాతం వసూలు చేసిన గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమ చేయాలని, ఇళ్ల యజమానులకు డిమాండ్ నోటీసులు జారీ చేసి ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు. సెర్ప్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఏకరూప చీరల పంపిణీకి కార్యచరణ రూపొందించాలని సూచించారు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించేందుకు పని ప్రదేశాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి అభివృద్ధి పనులను పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతి, గృహ నిర్మాణ శాఖ పీడీ ప్రకాష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



బ్లాంకెట్లు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అదనపు ఎస్పీ చిత్తరంజన్ అన్నారు. కెరమెరి మండల లైన్‌పటార్, గౌరి గ్రామాల్లో పోలీసులు మీ కోసంలో భాగంగా జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఆదేశాల మేరకు బుధవారం గ్రామస్థులకు బ్లాంకెట్స్, యువతకు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో చలి తీవ్రంగా ఉందని చెప్పారు. అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు అవుతుండడంతో ప్రజలు ఇబ్బందులు పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం లైన్ పటారలో 20 మందికి బ్లాంకెట్స్, గౌరి గ్రామంలో 40 మందికి బ్లాంకెట్స్, యువతకులకు వాలీబాల్ కిట్లను అందజేశారు. యువత వ్యసనాల బారిన పడకుండా చదువుపై దృష్టి పెట్టాలన్నారు. లక్ష్యం చేరుకునేందుకు క్రమశిక్షణతో చదువకోవాలని సూచించారు. యువతకు సహకారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ, ఎస్సై మధుకర్ ఉన్నారు.

పంటల రక్షణకు సోలార్ కంచె

కెరమెరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువుల బారి నుంచి పంటలను రక్షించుకేందుకు రైతులు ఇబ్బంది పడేవారు. రాత్రిపూట పంట చేల వద్ద కాపలా కాసినా పెద్దగా ప్రయోజనం లేకుండా పోయింది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి దూరమైంది. సోలార్ కంచెతో పంటల రక్షణకు ఢోకా లేకుండా పోయింది. అటు అటవీ జంతువులకు ఎలాంటి హానీ లేకపోవడంతో వీటి వినియోగం పెరుగుతున్నది. వానాకాలంలో సాగు చేస్తున్న పత్తి, కంది పంటతో పాటు యాసంగిలో మొక్కజొన్న, శనగ పంటలకు అటవీ జంతువుల బెడద కొంతకాలంగా ఎక్కువైంది. అడవి పందులు, కోతులు, మనుబోతులు ఈ పంట లకు నష్టం కలిగిస్తున్నాయి. వీటి నుంచి పంటలను రక్షించుకునేందుకు వీలుగా సోలార్ కంచెలను రైతులు ఏర్పాటు చేసుకుంటున్నారు. కెరమెరితో పాటు గోయగాం, సావర్‌ఖేడ, సుర్దాపూర్, ఇందాపూర్, నిషాని, ఖైరి, సాంగ్వీ, కేలి(బి), కేలి(కె), ధనోర, కోటారితో పాటు అటవీ ప్రాంత గ్రామాలైన జోడేఘాట్, బాబేఝరి, పాట్నాపూర్, అనార్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో సోలార్ కంచెలు నిర్మించుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



పంట చేనులో ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్

అందుబాటులో పలు రకాల మోడళ్లు..

అడవి పందులతో పంటలను రక్షించుకునేందుకు వీలుగా సోలార్ కంపెనీలు వివిధ మోడళ్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. రెండెకరాలు మొదలుకొని 20 ఎకరాలకు వరకు వినియోగించేలా వివిధ మోడళ్లను మార్కెట్‌లోకి తీసుకొచ్చాయి. 9వేల నుంచి 15వేల రూపాయల వరకు ఆయా కంపెనీలను బట్టి లభిస్తున్నాయి. నాలుగు ఎకరాల వరకు ఉన్న పంట చుట్టూ కంచె కోసం 20వోల్ట్స్ సోలార్ ప్యానెల్, 12 ఆంప్స్ (ఏహెచ్) బ్యాటరీ, ఎనర్జర్, కర్రలకు బిగించే 100 టర్నర్లు, బ్యాటరీ క్లిప్పులు మొత్తంగా సుమారు 9వేల రూపాయలకు దొరుకుతున్నాయి. నాలుగు ఎకరాల నుంచి 20 ఎకరాలకు వరకు వినియోగించేందుకు వీలుగా 40వోల్ట్స్ సోలార్ ప్యానెల్, 32 ఆంప్స్(ఏహెచ్) బ్యాటరీ, ఎనర్జర్, కర్రలకు బిగించే 150 టర్నర్లు, బ్యాటరీ క్లిప్పులు మొత్తంగా సుమారు 15వేల రూపాయలకు దొరుకుతున్నాయి. వీటిని కొనుగోలు చేసిన రైతులు పొలాలు చుట్టూ కంచె ఏర్పాటు చేసుకుని పంటను రక్షించుకుంటున్నారు. పొలం చుట్టూ ఇనుప తీగ కర్రలకు టర్నర్ల సహాయంతో ఫెన్సింగ్‌లా కట్టుకొని సోలార్‌కు అనుసంధానం చేస్తున్నారు. సోలార్ ఫెన్సింగ్‌తో అటవీ జంతువుకు ప్రాణ నష్టం ఉండదని చెబుతున్నారు.

విద్యార్థినులకు ముగ్గుల పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం విద్యార్థినులకు మెహందీ, ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు. కార్యకరమంలో లైబ్రేరియన్ ప్రవీణ, స్వర్ణలత, సదానందం, రికార్డు అసిస్టెంట్ సతీదేవి, సిబ్బంది సలీం, రామయ్య, గోపి పాల్గొన్నారు.

షీ టీం సేవలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

ఆసిఫాబాద్ రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూర్గుడ మహాత్మజ్యోతిబాపూలే పాఠశాలలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, షీటీం ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏహెచ్‌టీయూ ఇన్‌చార్జి ఎస్సై బిక్కులాల్ మాట్లాడుతూ విద్యార్థినులు, మహిళలు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100కు, షీ టీం హెల్ప్‌లైన్ 8712670564కు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై నర్సయ్య, పోలీసు సిబ్బంది రజిని, స్వప్న, వరలక్ష్మి, దినేష్, ప్రిన్సిపాల్ శ్వేత తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం.. యువకుడి మృతి

జన్నారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ శివారులోని షాదర్‌నగర్‌కు వెళ్లే రోడ్డులో నానక్‌రాం గూడెం వద్ద బైక్‌ను ఆటో ఢీకొట్టడంతో మండలంలోని మహ్మదాబాద్ గ్రామానికి చెందిన రాంటెంకి సిద్ధార్థ్ (20) అనే విద్యార్థి మృతి చెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు రాంటెంకి సిద్ధార్థ్ హైదరాబాద్‌లో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం రాత్రి సిద్ధార్థ్ నానక్‌రాంగూడెం గుండా బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టడంతో సిద్ధార్థ్‌కు తలకు తీవ్ర గాయమైంది. దీంతో సిద్ధార్థ్ అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. సిద్ధార్థ్‌కు తండ్రి శంకర్, తల్లి అమృత ఉన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

25 తులాల బంగారం అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న సీఐ బాలాజీ వరప్రసాద్

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని సాయినగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి 25 తులాల బంగారం, రూ. 15 లక్షల నగదును అపహరించుకు వెళ్లారు. బాధితురాలు కవిత కూతురు ప్రసూతి కోసం ఇంటికి తాళం వేసి వారం రోజుల క్రితం మంచిర్యాల ఆసుపత్రికి వెళ్లింది. బుధవారం ఇంటికి వచ్చిన యాజమానికి తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బాలజీ వరప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని దొంగతనంకు సంబంధించి వివరాలను సేకరించారు. ఇంటికి తాళం వేసి ఊరు వెళితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు అనుమా నాస్పదంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

షార్ట్‌సర్క్యూట్‌తో సామగ్రి దగ్ధం



సెల్‌ఫోన్ దుకాణంలో కాలిపోయిన వస్తువులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వివేకానందచౌక్ సమీపంలో ఉన్న శ్రీబాయ్ సెల్‌పాయింట్ మొబైల్ షాపులో మంగళవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని సామగ్రి కాలిపోయింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యాజమాని తెలిపాడు. మంగళవారం రాత్రి సమయంలో దుకాణం మూసిన తర్వాత అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. దుకాణం నుంచి దట్టమైన పొగ మంటలు రావడం గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. కానీ అప్పటికే దుకాణంలో ఉన్న మొబైల్‌ఫోన్లు,పరికరాలు, సామగ్రి పూర్తిగా కాలిపాయాయి.

పిల్లల చిత్రాల ప్రత్యేక ప్రదర్శన

ఆసిఫాబాద్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని సినిమా థియేటర్లలో పిల్లల చిత్రాల ప్రత్యేక ప్రదర్శన చేపడుతున్నామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు జిల్లాలోని సినిమా థియేటర్లలో పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక చిత్రప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ఒక్కోరికి రూ.25, పట్టణ ప్రాంతాలో రూ.30 టికెట్ ధర నిర్ణయించామని తెలిపారు. థియేటర్ల పరిధిలోని అన్ని పాఠశాలలు తమ విద్యార్థులకు చిత్రపదర్శన తిలకించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



సైబర్ నేరాలపై ఉక్కుపాదం

- అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్టు చేసిన పోలీసులు
- ఆన్‌లైన్ ట్రేడింగ్, లోన్ యాప్స్‌తో రూ. కోట్లు మాయం

కాగజ్‌నగర్ టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై పోలీసులు ఉక్కుపాదం మోపుడుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఇటీవల పెరుగుతున్న చోరీలు, సైబర్ నేరాలు ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. ఈ కేసులను కాగజ్‌నగర్ పోలీసులు వేగంగా ఛేదిస్తూ అంతర్రాష్ట్ర ముఠాలను అదుపులోకి తీసుకుంటున్నారు. ఆగస్టు నెలలో కాగజ్‌నగర్‌లో చోటు చేసుకున్న సైబర్ క్రైం కేసు ఛేదించడం గమనార్హం. పక్కా ఆధారాలతో ముగ్గురునిందితుల వాడిన బ్యాంకు ఖాతాలు, వారి లావాదేవీలతో గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో పట్టుకున్నారు. వీరిలో ప్రధాన నిందితులైన కడవల భవేష్ సిదాబాయ్(అహ్మదాబాద్), రాథోడ్ రాహుల్(అహ్మదాబాద్), సాహు సదీప్(అహ్మదాబాద్) ఇటీవల అరెస్టు చేశారు.

కాగజ్‌నగర్ డీఎస్పీ వహిదోద్దీన్, సీఐ ప్రేం కుమార్ సిబ్బంది ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. టెక్నికల్ అనాలసిస్, డిజిటల్ ఫుట్ ప్రింట్స్, కాల్ డేటా రికార్డుల ఆధారంగా వారు అనేక రాష్ట్రాలకు ట్రాక్ చేసిన నిందితులను అరెస్టు రిమాండుకు తరలించారు. డీ4సి ఆపరేషన్ పోలీసులు చేపట్టిన అత్యంత వేగవతంతమైన చర్యల్లో ఒకటిగా చెబుతున్నారు.

ఐదేళ్ల క్రితం బాలాజీనగర్‌లో పలు ఇళ్లల్లో చోరీ జరిగింది. ఈ కేసును పోలీసులు లోతుగా అధ్యయనం చేసి అప్పట్లో లభించిన క్లూస్‌ను తాజాగా వచ్చిన డేటాతో సరిపోల్చి కేసును పునఃపరిశీలించి, సరైన వ్యక్తుల కదలికలను సమన్వయం చేసి పక్కా ఆధారాలతో గత కేసులతో పోల్చి ఈనెల 19న ఛేదించారు. ఈ కేసులో 17 తులాల బంగారాన్ని స్వాధీనం చేసి కోర్టులో చోరీకి పాల్పడిన వారిని హాజరు పర్చారు. సొత్తు కూడా రికవరీ చేయించారు. అక్టోబరు నెలలో బతుకమ్మ పండుగ సందర్భంగా పలు ప్రాంతాల్లో చోరీకి పాల్పడిన సంఘటన కేసును కేవలం పక్షం రోజుల్లో ఛేదించారు.

ఈ కేసులో ప్రధానంగా సీసీ పుటేజీల్లో లభించిన ఆధారాలు, అనుమానస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి నలుగురిని అరెస్టు చేశారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి మధ్యప్రదేశ్, గుజరాత్, మహరాష్ట్ర, తదితర రాష్ట్రాల్లోకి వెళ్లి కేసులను ఛేదిస్తున్నారు. ఆసిఫాబాద్ సీఐ బాలాజీ వర ప్రసాద్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేంకుమార్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ కుమార స్వామి, టాస్క్‌ఫోర్స్ సీఐ, ఎస్సైలు సుధాకర్, సందీప్, ప్రశాంత్, యాదగిరి ప్రత్యే క ఆపరేషన్లలో కేసులు ఛేదిస్తున్నారు.

ఇటీవల ఇలా..

- గత నెల 29న ఆన్‌లైన్ కేసులో మోసపోయిన రూ. 45 వేల నుంచి 35 వేలు కేసును ఛేధించి ఆ మొత్తాన్ని ఫ్రీజ్ చేయించారు. ఈ కేసులో కాగజ్‌నగర్ రూరల్ పోలీసులు ఒక్కరిని అరెస్టు చేసి కాగజ్‌నగర్‌కు తీసుకువచ్చారు.
- ట్రేడింగ్, ఆన్లైన్ పెట్టుబడి పేరిట మోసం మరో నిందితుడిని కాగజ్‌నగర్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ మోసంలో వాట్సాప్ గ్రూపు తయారు చేసి 108 మంది చేర్చి 76.50 లక్షలు మోసం చేసి గ్రూపును తొలగించారు.
- కాగజ్‌నగర్ టౌన్‌లోని మరో కేసులో ముగ్గురు నిందితులను గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పట్టుకొని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.
- ఆన్‌లైన్ ట్రేడింగ్ కేసులో నవంబరు 16న తిరిగి మరో ఇద్దరు నిందితులను కాగజ్‌నగర్ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్, మహారాష్ట్రలోని పుణేలో వీరిని పట్టుకొని రిమాండుకు తరలించారు.
- ఆసిఫాబాద్‌లో ఆన్‌లైన్ కేసులో డబ్బులు పొగొట్టుకొన్న కేసులో 1.66 లక్షల్లో రూ. 60వేలు ఫ్రీజ్‌చేశారు. ఈ కేసులోనూ నిందితులు ఇద్దరిని గుజరాత్ రాష్ట్రంలో అరెస్టు చేశారు.
- కాగజ్‌నగర్ టౌన్ క్రైం నెం.184/2025 కేసులో ఫేక్ ట్రేడింగ్ కేసులో రూ. 76.50 లక్షలు కోల్పోయిన బాధితుడి కేసులో ఏ-1, ఏ-2లు గతంలో పట్టుబడ్డారు. ఏ-3, ఏ-4లను ఇద్దరిని గుజరాత్‌లో అరెస్టు చేశారు.



సైబర్ క్రైం వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్(ఫైల్)

ఉన్నతాధికారుల సూచనలతో..

డీఎస్పీ వహిదుద్దీన్, కాగజ్‌నగర్



ఏ కేసు ఛేదించినా కూడా ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు, అలాగే స్థానిక పోలీసుల అందరి సమష్టి కృషితోనే గతంలో జరిగిన కేసులను ఛేదిస్తు న్నాం. పక్కా ప్రణాళికాబద్ధంగా వివరాలు సేకరిస్తున్నాం. ఆధునిక టెక్నాలజీ సహాయంలో క్లూస్ సేకరిస్తున్నాం. కీలక కేసులు పరిష్కరిస్తున్నాం.

సాంకేతికత పరిజ్ఞానంతో..,

ప్రేమ్‌కుమార్, పట్టణ సీఐ, కాగజ్‌నగర్



ఆధునిక సాంకేతితో చోరీ కేసులను ఛేదిస్తున్నాం. అంతరాష్ట్ర సైబర్ క్రైం ముఠాను కూడా పట్టుకున్నాం. పట్టణంలో ప్రతి దుకాణం వద్ద సీసీ కెమెరాను ఏర్పా టు చేసుకోవాలని సూచిస్తున్నాం. దీని ద్వారా చోరీలు తగ్గుముఖం పడుతాయి. చోరీ జరిగినా సీసీ పుటేజీల ఆధారంగా కేసును ఛేదిస్తాం.

సోలార్ వాటర్ హీటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో సోలార్ వాటర్ హీటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ట్రైబల్ వెల్ఫేర్ అధికారి రమాదేవికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ చలి తీవ్రత పెరగడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఆశ్రమ పాఠశాలల్లో సోలార్ వాటర్ హీటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి, శివప్రసాద్, అమర్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

సిర్పూర్(టి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని రైతు వేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ రహీముద్దీన్ బుధవారం ఒక ప్రకనటలో తెలిపారు. లబ్ధిదారులు వారి వెంట ఆధార్ కార్డు తీసుకు రావాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండె విఠల్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు హాజరు కానున్నారని తెలిపారు.

పంచాయతీ రికార్డుల ఆడిట్

సిర్పూర్(టి), నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 16 గ్రామ పంచాయతీలలోని 2024-25 ఆర్థిక సంవత్సరం రికార్డులకు సంబంధించి ఆడిట్‌ను జిల్లా అధికారి శంకర్ నిర్వహిం చారు. బుధవారం జోరేపల్లి గ్రామ పంచాయతీకి సంబంధించి ఆడిట్ నిర్వహించారు. కార్యక్రమంలో కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముదిరాజ్ మహాసభ, 11వ వార్షికోత్సవ వేడుకల పోస్టర్లను మండలంలోని ఉప్పల్ నవేగాంలో బుధ వారం ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సతీష్, శ్రీను, బాలేష్, రవి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంలో కాంగ్రెస్ విఫలం



మాట్లాడుతున్న బీసీ జేఏసీ జిల్లా నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకు రావడంలో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా విఫలమైందని బీసీ జేఏసీ జిల్లా కన్వీనర్ రూప్‌నార్ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు రిజర్వేషన్ అమలు కోసం కేంద్ర ప్రభుత్వంపై పోరాడాల్సిన కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేస్తోందని ఆరోపించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీ రిజర్వేషన్ల చట్టానికి అమోదం తెలపకుండా బీసీలకు అన్యాయం చేస్తుందని చెప్పారు. కేంద్రంపై పోరాడాల్సిన రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వెనకడుగు వేయడం సిగ్గు చేటన్నారు. రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న శాంతియుత రాస్తారోకోను బీసీలు విజయవంతం చేయాలని కోరారు. డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాలను వేదికగా చేసుకొని కాంగ్రెస్ పార్టీ కేంద్రంపై పోరాడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తక్షణమే రిజర్వేషన్‌ల చట్టాన్ని పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి ఆమోదించాలని కోరారు. రానున్న రోజుల్లో బీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ జేఏసీ జిల్లా కో కన్వీనర్ ప్రణయ్, నాయకులు సాయికృష్ణ సంజీవ్, మారుతి తదితరులు పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో గురువారం జిల్లా కేంద్రంలోని టాస్క్ ట్రైనింగ్ సెంటర్(పాత కలెక్టరేట్ భవనం)లో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి రవికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలోని 100 జాబ్‌లు ఫార్మసిస్టు(40), ట్రైనీ ఫార్మసిస్టు(20), ఫార్మసీ అసిస్టెంట్(30), రిటైల్ ట్రైనీ అసోసియేట్స్(10) కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పది, ఇంటర్, డి-ఫార్మసీ, బీ-ఫార్మసీ, డిగ్రీ చదివి, 18-26 వయస్సు గల వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


అనుమానాస్పదంగా గొర్రెలు మృతి



మృతిచెందిన గొర్రెలు

కన్నెపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆనందపూర్‌కు వెళ్లే దారిలో కురుమగూడెం(మొక్కంపల్లి)కి చెందిన పెద్దల్ల వీరమల్లుకు చెందిన సుమారు 26 గొర్రెలు బుధవారం అనుమానాస్పదంగా మృతిచెందాయి. మేత కోసం తీసుకెళ్లిన గొర్రెలు ఎలా మృతిచెందాయో అర్థం కావడం లేదని వీరమల్లు ఆవేదన వ్యక్తం చేశాడు. గొర్రెలు మృతిచెందడంతో తన జీవనోపాధి పోయిందన్నారు. గొర్రెల విలువ సుమారు రూ. 2 లక్షల వరకు ఉంటుందని ప్రభుత్వం స్పందించి తనను ఆదుకోవాలని వేడుకున్నాడు.

పల్టీ కొట్టిన ట్రాక్టర్..తప్పిన ప్రాణాపాయం



రోడ్డుపై పడిపోయిన ఇటుకలు

మంచిర్యాల క్రైం,నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తా వద్ద ముల్కల్ల నుంచి నస్పూర్ వైపు వెళ్తున్న ఇటుక లోడ్‌తో కూడిన ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో రోడ్డుపై ఇటుకలు చెల్లా చెదురుగా పడిపోయాయి. రద్దీగా ఉండే ఐబీ ప్రాంతంలో పల్టీ కొట్టే సమయంలో పక్కన ఎవరు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ట్రాక్టర్ వెనుక టైరు ఇరుసు విరగడంతో ఈ ప్రమాదం సంభవించింది.

కిరాణా షాపులో చోరీ

మంచిర్యాల క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గౌతమి నగర్‌లోని శ్రీనివాస సాయి కిరాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు యజమాని గణేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రాత్రి కిరాణా షాపును బంద్‌చేసి షెటర్లకు లాక్ వేసి ఇంటికి వెళ్లాడు. తెల్లవారుజామున షాపును తెరిచేందుకు వచ్చి చూడగా షెటర్ లాకులు పగలగొట్టి కౌంటర్లో ఉన్న రూ. 1 లక్షా 70 వేలు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. గణేష్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

డ్రైవర్లు లైసెన్స్ కలిగి ఉండాలి

జైనూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్లు తప్పని సరిగ్గా లైసెన్స్ కలిగి ఉండాలని సీఐ రమేశ్ అన్నారు. మండల కేంద్రంలో ఆటో డ్రైవర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ముఖ్యంగా మూల మలుపుల వద్ద వాహనాలు జాగ్రత్తగా నడపాలని చెప్పారు. అజాగ్రత్తగా మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఆటోలలో గంజాయి అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందిందని అలాంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని సీఐ సూచించారు. కార్యక్రమంలో ఎస్సై రవి కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాస పథకం అమలు చేయాలి

వాంకిడి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాస పథకాన్ని అమలు చేయాలని బుధవారం సీపీఐ నాయకులు ఎంపీడీవో జ్యోత్స్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువతకు స్వయం ఉపాధి ద్వారా అభివృద్ధి చెందాలని రాజీవ్ యువ వికాస్ పథకాన్ని తీసుకు వచ్చారని అన్నారు. యువత ఎన్నో ఆశలతో దరఖాస్తు చేసుకున్నా నేటికీ ప్రభుత్వం రుణాలు అందించలేదన్నారు. స్వయం ఉపాధి పొందడం ద్వారా కుటుంబాలను పోషించుకుంటామని భావించిన యువతకు నిరాశే మిగిలిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చిరంజీవి, మహేష్, రాకేష్, వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తింపు సంఘం ఎన్నికల సందర్భంగా కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు సీతారామయ్య అన్నారు. ఎస్ఆర్‌పీ 1 గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఆర్‌పీ 1, ఆర్‌కే న్యూటెక్ గనులను మూసివేయనున్నట్లు యాజమాన్యం ప్రకటించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి జీవితకాలం పెంచేందుకు ఒప్పించామన్నారు. దీనివల్ల మరో ఐదేళ్ల పాటు కార్మికులు పనిచేసుకునే సౌకర్యం కలిగిందన్నారు. తాము ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చెప్పారు. డిపెండెంట్ల వయస్సు పెంపు, కోటి రూపాయల ప్రమాదబీమా, హైదరాబాద్‌లో కార్పొరేట్ ఆస్పత్రి నిర్మాణానికి హామీ, సర్ఫేస్ జనరల్ మజ్దూర్ పోస్టులు ఇప్పించడం వంటివి అమలు చేశామన్నారు. త్వరలో సొంతింటి పథకం కూడా పూర్తి చేస్తామన్నారు. గోదావరిఖనిలో గుండె జబ్బుల చికిత్స కోసం ఏర్పాట్లు చేయించామన్నారు జనవరి నాటికి కార్మికులకు వైద్యం అందుతుందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ఏఐటీ యూసీకి మద్దతుగా ఉండాలని ఆయన కోరారు. సమావేశంలో ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు బుచ్చయ్య, అఫ్రోజ్‌ఖాన్, పిట్ కార్యదర్శులు దాడి రాజయ్య, మోతె లచ్చన్న, మురళి చౌదరి, సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై పట్టింపు కరువు

శ్రీరాంపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తోందని, తాము ప్రశ్నిస్తున్నందుకు అరెస్టులు చేయించడం సమంజసం కాదని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండి రియాజ్ అహ్మద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ముట్టడికి వెళ్తున్న హెచ్‌ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎండి రియాజ్ అహ్మద్, రాష్ట్ర అధ్యక్షుడు తిప్పారపు సారయ్య, కేంద్ర కార్యదర్శి ఇస్మాయిల్, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి పొనగంటి అశోక్, నాయకులు పూదరి సందీప్ గౌడ్, అడ్లూరి అనిల్, చెవుల శ్రీనివాస్, కె. రవిందర్ రెడ్డి, బి. కళ్యాణ్, తదితరులను నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, విజిలెన్స్ బాధితులు, మారుపేర్ల సమస్య కొన్నేళ్లుగా అలాగే ఉందన్నారు. పెర్క్స్‌పై ఆదాయపు పన్నును యాజమాన్యమే చెల్లించాలన్నారు. మెడికల్ బోర్డు నిలిచిపోవడంతో కార్మికుల వారసులకు ఉద్యోగాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే ఉద్యోగాలు వచ్చేలా నెల నెలా బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. ఇటీవల 150 మస్టర్ల సర్క్యులర్‌ను తీసుకురావడం దారుణమన్నారు. నెలకు 16 మస్టర్లు లేకుంటే కౌన్సెలింగ్ నిర్వహించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. బాగా పనిచేస్తున్న ఉద్యోగులను కౌన్సెలింగ్ పేరుతో వేధించడం తగదన్నారు. ఏళ్లుగా సమస్యలు పరిష్కారం చేయకుండా ఉద్యోగులకు నష్టం చేసే సర్క్యులర్లు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా విషయాలపై జాగృతి, హెచ్‌ఎంఎస్ సంయుక్తంగా సింగరేణి భవన్ ముట్టడికి పిలుపునిస్తే తమ నాయకులను అరెస్ట్ చేయడం తగదన్నారు. ఇలాంటి చవకబారు పనులు మానుకొని కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని యాజమాన్యానికి హితవు పలికారు. కాగా సింగరేణి భవన్ ముట్టడికి తరలిన జాగృతి, హెచ్‌ఎంఎస్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని హెచ్‌ఎంఎస్ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి ఒక ప్రకటనలో ఖండించారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరితే ఇలా అక్రమంగా అరెస్టులకు పాల్పడడం సరికాదని తెలిపారు. వెంటనే వారిని విడుదల చేసి కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

పెంచికలపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీవో ఆల్బర్ట్ అన్నారు. మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఎంపీడీవో పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతగా పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆసిఫాబాద్‌రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై బూరుగడ రాజేంద్రప్రసాద్ బీఈడీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ వరప్రసాద్ నకిలీ ఐపీఓ, పార్ట్ టైం జాబ్, నకిలీ ట్రేడింగ్ ప్లాట్ ఫాం మోసంపై వివరించారు. సైబర్ నేరాలపై జాగ్రత్తగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో లెక్చరర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయాలి

వేమనపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని కవ్వంపల్లి గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో కుమార సామి సూచించారు. బుధవారం కల్లెంపల్లిలో నిర్మాణమవుతున్న ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసి బిల్లులను పొందాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం గ్రామంలోని నర్సరీ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో మహేశ్వర్ రెడ్డి, ఈసీ మధూకర్, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్ ఉన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన'

మందమర్రిరూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మామిడిగట్టు, వెంకటాపూర్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను బుధవారం ఎంపీవో సత్యనారాయణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. అలాగే ఈ నెల 25లోగా వంద శాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గ్రామాలు అభివృద్ధి జరగాలంటే ప్రజలందరు పన్నులను చెల్లించాలన్నారు. ఆయన వెంట కార్యదర్శులు ప్రశాంత్, సంధ్యారాణి ఉన్నారు.

ఆర్థిక సహాయం

శ్రీరాంపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్‌లోని ఆర్కే న్యూటెక్ గనిలో పనిచేస్తూ మరణించిన కార్మికుడి కుటుంబానికి సహచర కార్మికులు ఆర్థిక సహాయం అందించారు. జనరల్ అసిస్టెంటుగా పనిచేస్తున్న బొబ్బల శ్రీనివాస్ రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో ఇంజనీరింగ్ విభాగం ఉద్యోగులు తలా కొంత జమ చేసి 77 వేల రూపాయలను అతని కుటుంబానికి అందించారు.

రైతులకు భారంగా వరి కోతలు


సకాలంలో హార్వెస్టర్ దొరకకపోవడంతో నేలవాలిన వరి పంట



● చైన్ హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్

తాండూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో వరి కోతలు రైతులకు భారంగా మారాయి. ఏజెన్సీ గ్రామాల్లో వరి కోతల యంత్రాలు (హార్వెస్టర్‌లు) సాయంతో కొనసాగుతున్నాయి. ఈ వానాకాలంలో సీజన్ ప్రారంభంలో వ్యవసాయ బావులు, బోర్ల కింద ముందుగా రైతులు ఐదు నెలల క్రితం వరి నాట్లు వేశారు. ప్రస్తుతం వరి కోత దశకు రావడంతో రైతులు హార్వెస్టర్ల సహాయంతో నూర్పిడి మొదలు పెట్టారు. మండలంలో 3,700 ఎకరాల్లో సారి ఖరీఫ్ పంటగా వరిసాగు చేశారు. అయితే 51,580 టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. కోతలు మొదలై 20 రోజులు కావ స్తోంది. మండలంలో పది వరి కోత యంత్రాలు ఉండగా ప్రతి గ్రామానికి దాదాపు 6 నుంచి 8వరకు కోత యంత్రాలు అవసరం ఉంది.

యంత్రాలకు పెరిగిన డిమాండ్

వరి కోత యంత్రాలు స్థానికంగా అరకొరగా ఉండడం దీంతో పాటు అన్నదాతలు ఒకేసారి వరి కోతలకు సిద్ధం కావడంతో హార్వెస్టర్లకు డిమాండ్ పెరిగింది. కరీం నగర్, పెద్దపల్లి, ఆంధ్రప్రదేశ్‌లోని ఇతర ప్రాంతాలకు వెళ్లి హార్వెస్టర్లను అద్దెకు తెచ్చి వరి నూర్పిడి చేయిస్తున్నారు. వరి కోత మిషన్‌లకు డిమాండ్ పెరగడంతో యంత్రాల యాజమానులు గంటకు రూ. 2,500 నుంచి రూ. 3 వేల వరకు రైతుల నుంచి వసూలు చేస్తున్నా రు. టైర్లతో కోసే యంత్రానికి గంటకు రూ. 2,300 నుం చి రూ. 3 వేల వరకు, ట్రాక్ చేంజ్ ద్వారా నడిచే యం త్రానికి రూ. 3,300 నుంచి రూ. 3800ల వరకు వసూలు చేస్తున్నారు. దీంతో రైతులకు ఇది భారంగా మారింది. సకాలంలో హార్వెస్టర్‌లు దొరక్కపోవడంతో కోతకు వచ్చిన వరి పంట కిందకు వాలిపోతుంది.

కూలీలకు ఉపాధి కరువు

రైతులు వరినూర్పిడి యంత్రాలపై మొగ్గు చూపడంతో రెండుమూడేళ్లుగా గ్రామీణ ప్రాంతంలో కూలీలకు ఉపాధి కరువైంది. ఒక ఎకరం వరి పొలం కూలీలు అయితే కూలీలు రూ. 10 వేల నుంచి 15 వేల వరకు ఖర్చు వస్తుందని, అది కూడా కోత కోసిన నాలుగైదు రోజులు వడ్లు పొలంలోనే ఉంటాయి. తర్వాత కుప్పలు వేసి కొట్టించాల్సి ఉంటుంది. ఈ పద్ధతి వల్ల డబ్బులు అధికంగా ఖర్చు కావడంతో పాటు ఎక్కువ రోజులు సమయం పడుతుంది. అదే యంత్రాల ద్వారా అయితే గంటలోనే ధాన్యాన్ని ఇంటికి చేర్చుకునే అవకాశం ఉన్నందున రైతులు యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు.

పశుగ్రాసానికి నష్టం

రైతులు తక్కువ సమయంలో యంత్రాల ద్వారా వరి కోతలు కోయడం ద్వారా ధాన్యం చేతికి వస్తున్నప్పటికీ పశువులకు గ్రాసం కొరత ఏర్పడుతుంది. వరికోత కూలీలు లేదా టిల్లర్‌తోకోస్తేనే వరి గడ్డి పశువులకు ఉపయోగపడుతుంది. లేదంటే గడ్డి పనికి రాకుండా పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి గడ్డి కట్టలు కట్టేందుకు కూడా ప్రత్యేక యంత్రం ద్వారా కట్టకు రూ. 30 చొప్పున వసూలు చేస్తుండడంతో రైతులకు భారంగా మారింది.

అధిక ధర చెబుతున్నారు..: మధు, రైతు, రేచిని



ప్రతియేటా వరి పంట కోయడానికి పెద్దపల్లి, కరీంనగర్ నుంచి యంత్రాలను తీసుకువస్తాను. ఈ సంవ త్సరం సీజన్ లేటు కావడంతో పెద్దపల్లి, కరీంనగర్‌లలో వరి కోతలు కాక పోవడంతో ఇటు యంత్రాలు రావడానికి కష్టంగా ఉంది. యంత్రాలకు డిమాండ్ ఉండడంతో ధర కూడా ఎక్కువగా ఉండడంతో ఆర్థిక భారం ఎక్కువగా పడుతోంది.

యంత్రాల ద్వారా ఖర్చే: మల్లేష్, రైతు, తాండూర్



హార్వెస్టర్ యంత్రాలకు గంట చొప్పున ధర చెబుతుండడంతో ఎకరానికి దాదాపు రెండు గంటల వరకు సమయం పడుతుంది. యంత్రాల ద్వారా త్వరగా వరి కోత అవుతుంది కానీ ధర కూడా అధికంగా ఉండడం తో ఖర్చు పెరుగుతుంది. టైర్లతో కోసే యంత్రానికి గం టకు రూ. 2,300 నుంచి రూ. 3 వేల వరకు, ట్రాక్ చేం జ్ ద్వారా నడిచే యంత్రానికి రూ. 3,300 నుంచి రూ. 3800ల వరకు వసూలు చేస్తున్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

తాండూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఝాన్సీలక్ష్మీబాయిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంఈవో మల్లేశం పేర్కొన్నారు. ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని నారీ యువశక్తి ఫోరం ప్రధాన కార్యదర్శి చిలుముల శ్రీకృష్ణదేవ రాయలు ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం బహుమతులు అందించారు. వారు మాట్లాడుతూ ఝాన్సీలక్ష్మీబాయి జీవిత చరిత్రను విద్యార్థినులు తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సుష్మ, కస్తూర్బా ఎస్‌వో కవిత, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సూరం రవీందర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు చిలువేరు శేషగిరి, బీఆర్ఎస్ నాయకుడు ఎల్క రాంచందర్, ఉపాధ్యాయులు ప్రకాష్, మీనా, స్వప్న, అశోక్, సాంబమూర్తి, శ్రీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూటీయూ మండల కమిటీ ఎన్నిక

కాసిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ (టీడబ్ల్యూటీయూ) మండల నూతన కమిటీని బుధవారం మల్కేపల్లి స్కూల్ కాంప్లెక్స్‌లో జిల్లా ప్రధాన కార్యదర్శి రొడ్డ కార్యదర్శి ఆద్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా పెద్ది సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బోగె లక్ష్మణ్, గౌరవాధ్యక్షులుగా రమాదేవి, ఉపాధ్య క్షులుగా సతీష్, చిన్నమ్మ, కోశాధికారిగా సిడాం భీంరావు, మహిళ అధ్యక్షురాలుగా పెంద్రం విమల, గెడెం సువర్ణ, కార్యదర్శిగా నవనందుల శ్రీహరి, అల్లాడి మొండయ్య, గౌరవ సలహాదారులుగా మనుబోతుల శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమయ్య, రాజేశ్వర్‌రావు, శంకర్ పాల్గొన్నారు.

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

భీమిని, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : బాలికను మోసం చేసి వివాహం చేసుకున్న ఓ వ్యక్తిపై పోలీసులు పోక్సో చట్టం కింద బుధవారం కేసు మోదు చేశారు. మండలంలోని కేస్లాపూర్ గ్రామానికి చెందిన కొమురం నరేష్ అదే గ్రామానికి చెందిన ఓ బాలికను ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడు. ఈ నెల 12న బాలికకు మాయమాటలు చెప్పి ఇంటి నుంచి తీసుకొనివెళ్లి రెండు రోజుల క్రితం వివాహం చేసుకొని కాగజ్‌నగర్‌లో మకాం పెట్టాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంలో నరేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.

తిలక్‌వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

బెల్లంపల్లి, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): తిలక్ గ్రౌండ్ వాకర్స్ అసోసియేషన్ కమిటీ ఎన్నికున్నట్లు కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు. వ్యవస్థాపక అధ్యక్షుడిగా రత్నం రాజన్న, నాగేశ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా దత్తాత్రేయ శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా విద్యాసాగర్, ఆనంద్‌లోయ, అధ్యక్షుడిగా రంగ రామన్న, ఉపాధ్యక్షులుగా రమేశ్, లక్ష్మణ్, ప్రదాన కార్యదర్శిగా నాగేశ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా వెంకట్, నగేశ్, ప్రచార కమిటీ కార్యదర్శులుగా జయరాం యాదవ్‌తోపాటు సభ్యులుగా ఐలయ్య, రమేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఈ కమిటీ మూడేళ్ల కాలం సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు.

ఘనంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

మంచిర్యాల క్రైం,నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణ గ్రంథాలయంలో ఘనంగా 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహించారు. విద్యార్థులకు, పాఠకులకు ముగ్గుల పోటీలతో పాటు మెహందీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా శోభ పాల్గొనగా డిప్యూటీ డైరెక్టర్ అడల్ట్ పురుషోత్తం, శుభారాణి, పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి

భీమారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు వైద్య సేవలందించాలని ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ అప్పాల ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం భీమారంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలు, అసంక్రమణ వ్యాధుల పరీక్షలు చికిత్సలు, మందుల నిల్వలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. చలికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కీటక జనిత వ్యాధులైన మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా రాకుండా దోమల నిర్మూలన కార్యక్ర మాలను గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వంశీకృష్ణ, నర్సింగ్ అధికారి ప్రశాంతి, డీపీవో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి డిప్యూటేషన్ రద్దు చేయాలి


సోమగూడెం పాఠశాల నుంచి పిల్లలను తీసుకువెళ్తున్న తల్లిదండ్రులు

కాసిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోమగూడెం ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రవళిక డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరుతూ బుధవారం పాఠశాల పేరెంట్స్ కమిటీ, తల్లిదండ్రులు పాఠశాల ముందు ఆందోళన నిరసన చేపట్టారు. పేరెంట్స్ కమిటీ సభ్యురాలు సరిత చౌహాన్ మాట్లాడుతూ ముగ్గురు ఉపాధ్యాయులున్న సోమగూడెం పాఠశాలలో ఇప్పటి వరకు పాఠశాల సక్రమంగా కొనసాగిందని, విద్య కూడా అందిందన్నారు. కానీ ఉపాధ్యాయురాలును డిప్యూటేషన్ పంపడాన్ని ఖండిస్తున్నామన్నారు. పాఠ శాలలో 60 మంది పిల్లలకు ఇద్దరు ఉపాధ్యాయులు ఎలా బోధిస్తారని, దీంతో పిల్లలకు చదువు అందకుండా పోతుందన్నారు. వెంటనే డిప్యూటేషన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డిప్యూటేషన్ రద్దు చేసేంత వరకు పిల్లలను పాఠశాలకు పంపమని పేర్కొన్నారు. పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్తా కొద్దిసేపు పాఠశాల ముందు కూర్చుని నిరసన తెలిపారు. డిప్యూటేషన్ రద్దు చేయాలని కోరారు. లక్ష్మీ, లావణ్య, సుధ, సురేష్, కృష్ణ, రవి, నరేందర్, గౌరి, మమత, మధుమిత, మౌనిక పాల్గొన్నారు.

కొండెక్కిన కూరగాయలు...

(5వ పేజీ తరువాయి)

సరిపడా కూరగాయలు రావడం లేదంటూ సామాన్య జనం వాపోతున్నారు. వారానికి సరిపడా కూరగాయలు కొనుగోలు చేయాలంటే కనీసం రూ. 400 వెచ్చించాల్సి వస్తోందంటున్నారు.

శ్రావణ మాసం నుంచి...

మూడు నాలుగు నెలలుగా కూరగాయల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. ముఖ్యంగా శ్రావణ మాసం ప్రారంభమైన నాటి నుంచి మొదలుకొని ధరలు విపరీతంగా పెరిగాయి. శ్రావణ మాసం పవిత్రమైనది కావడంతో హిందువుల్లో అధిక భాగం ప్రజలు మాంసాహారానికి దూరంగా ఉంటారు. ఆ మాసంలో పూజలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు వర్షాకాలంలో మాం సాహారం భుజిస్తే రోగాల భారిన పడతారనే సైంటిఫిక్ రీజన్ కూడా ఉండటంతో కూరగాయలపైనే ప్రజలు అధికంగా ఆధారపడతారు. దీనికి తోడు మొంథా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాల కారణంగా కూరగాయలు, ఆకు కూరల దిగుబడి గణనీయంగా తగ్గింది. ఈ కారణం గానూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూరగాయలు అధిక ధరలు పలుకుతున్నాయి. శ్రావణం తరువాత కార్తీక మాసం రావడం, అనంతరం అయ్యప్ప మాలధారణ సమయం కావడంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. మరోవైపు జిల్లాలో కూరగాయల సాగు అంతంత మాత్రంగానే ఉంది. దీంతో దూరప్రాంతాల హోల్‌సేల్ వ్యాపారులు కూరగాయలు తెప్పిస్తున్నారు. వారి దగ్గరి నుంచి రిటైల్ విక్రేతలు కొనుగోలు చేసి, ప్రజలకు విక్రయించాలి. అలా వినియోగదారుల చేతికి అందేసరికి నాలుగైదు చేతులు మారాల్సి రావడం కూడా ధరలు పెరుగదలకు కారణంగా తెలుస్తోంది.

కలెక్టర్‌కు సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి 6వ జల పురస్కారాల్లో భాగంగా మంచిర్యాల జిల్లాకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకువచ్చిన కలెక్టర్ కుమార్ దీపక్‌ను అదనపు కలెక్టర్ చంద్రయ్య, ఉద్యోగులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, రెవెన్యూ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

చెరువులో చేప పిల్లల విడుదల


నల్లవాగు చెరువులో చేప పిల్లలను వదులుతున్న అధికారులు, నాయకులు

కన్నెపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వందశాతం రాయితీతో అందజేసిన చేప పిల్లలను బుధవారం మండలంలోని వీరాపూర్ గ్రామంలోని నల్లవాగు చెరువులో అధికారులు, కాంగ్రెస్ నాయకులు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి రాయితీపై చేప పిల్లలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పప్పుల రామాంజనేయ, మాజీ సర్పంచు జిల్లెల్ల అశోక్‌గౌడ్, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఆకుతోట రాజన్న, బెల్లంపల్లి నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఏల్పుల రోహిత్ మాజీ ఉపసర్పంచులు సుధీర్‌గౌడ్, వెంకటేష్, సుధాకర్, నాయకులు సురేష్, సత్యగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, జలపతి, సంతోష్, ఎంపీవో రమ్య, కార్యదర్శి తిరుపతి, మత్స్యశాఖ ఫీల్డ్‌మెన్ రాజేష్, శ్రావణ్, నీలతేజ పాల్గొన్నారు.

కరపత్రాలు విడుదల చేసిన మంత్రి

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : హలో మాల ఛలో హైద్రాబాద్ రణభేరి సభ కరపత్రాలను మంచిర్యాలలో బుధవారం మంత్రి వివేక్‌వెంకటస్వామి విడుదల చేశారు. మంత్రి మాట్లాడుతూ అందరు ఏకమై సమిష్టి కృషితో మాలల రణభేరిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల మాల సంఘం నాయకులు పొట్ట మధుకర్, సుదమళ్ల హరికృష్ణ, సునీల్, రాజన్న పాల్గొన్నారు.

రోడ్డు మార్గం ఏర్పాటు చేయండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

జన్నారం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పొన్కల్ గ్రామ పంచాయతీలో గల రామాలయం, అయ్యప్ప, సాయిబాబా ఆలయాలకు వెళ్లేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆలయాల వరకు రోడ్డు వసతి ఏర్పాటు చేయాలని తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి పొన్కల్ గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. శంకర్, హన్మంతరావు, భరత్ కుమార్ మాట్లాడుతూ ఆలయాలకు వెళ్లేందుకు ప్రభుత్వ భూమిలో సర్వే జరిపి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని అన్నారు. గ్రామస్థులు నర్సయ్య, భాస్కర్, ప్రభాకర్ రెడ్డి, లచ్చన్న, యూసుఫ్ పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ అందజేత

రామకృష్ణాపూర్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): గద్దెరాగడి ప్రాథమిక పాఠశాలలో పని చేస్తూ ఉపాధ్యాయుడు మల్లీఖార్జున్ గత సంవత్సరం మృతి చెందాడు. అయన జ్ఞాపకార్థం ఆయనతో చదివిన 2001-2003 డైట్ బ్యాచ్ చెందిన తోటి మిత్రులు రూ.20వేల విలువైన ఎల్ఈడీ టీవీని ప్రాథమిక పాఠశాలకు బుధవారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైద్య సుజాత, మాజీ కౌన్సిలర్ సత్తయ్య, డైట్ మిత్రులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి


మందమర్రిలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాల క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల కార్పోరేషన్ పరిధిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరితిరుపతి, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకులు ఇందిరాగాంధీ విగ్రహనికి పూల మాలలు వేసి నివాలులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. నాయకులు పెంట రజిత, నాయకులు పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: పట్టణంలోని ఐబీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ప్రదాని ఇందిరాగాంధీ జయంతి వేడుకలను పార్టీ శ్రేణులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపఠానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేసారు. ఈకార్యక్రమంలో నాయకులు పింగిళి రమేష్, అంకతి శ్రీనివాస్, రాజు, సుమన్, మడిపెల్లి స్వామి, అమీర్, రవీందర్, రాజమౌళి పాల్గొన్నారు.

దండేపల్లి : ఇందిరా గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ రాజీవ్‌గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి, పార్టీ మండల అధ్యక్షుడు అక్కల వెంకటేశ్వర్ కోరారు. బుధవారం దండేపల్లిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరా గాంధీ జయంతి నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్య క్షుడు సృజన్, మార్కెట్ కమిటీ డెరెక్టర్ రాజన్న పాల్గొన్నారు.

వెన్నెల : మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత దినోత్సవాన్ని నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్ మాట్లాడారు. నాయకులు బొమ్మెన హరీష్‌గౌడ్, శ్రీనివాస్, శ్రీనివాస్, బానేష్, సాంబమూర్తి గౌడ్, శంకరయ్య, రాజశేఖర్, మోహీద్ ఖాన్ పాల్గొన్నారు.

మందమర్రిటౌన్: భారత మాజీ ప్రదాని దివంగత ఇందిరాగాంధీ 108వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని మంత్రి వివేక్ క్యాంప్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ముందుగా ఇందిరాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఉపేందర్ గౌడ్, సుదర్శన్‌లు దండలు వేసి నివాళులు అర్పించారు. నర్సింగ్, రాజు, సుకూర్, నర్సోజీ, తిరుపతి, అర్జున్, సంతోష్‌గౌడ్, సునిల్‌కుమార్ పాల్గొన్నారు.

కాసిపేట: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆత్మ చైర్మన్ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు మైదం రమేష్, గోలేటి స్వామి, జాడి శివ, రాజేష్, షారుక్, కుర్మ పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలో కాంగ్రెస్ పార్టీకార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలలు వేసి ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. కాంగ్రెస్ నాయకులు కనకరాజు, కళ్యాణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు రామకృష్ణ, రవీందర్, రాజేశ్‌పాల్గొన్నారు.

బెల్లంపల్లి: పట్టణంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఇందిరగాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, నాయకులు సూరిబాబు, నెల్లి రమేశ్ పాల్గొన్నారు.

జన్నారం: ఇందిరాగాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు మాణిక్యం, సయ్యద్ ఇసాక్, శంకరయ్య, ఇంధయ్య, రమేశ్, పంకజ, లక్ష్మీ, సహీన్ ఫాతిమా పాల్గొన్నారు.

నేడు మ్యాదరిపేటలో ఆధార్ స్పెషల్ క్యాంపు

దండేపల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తామ ఆధార్ కార్డులో తప్పొప్పులతో ఇబ్బంది పడుతున్న దృష్టా పోస్టల్ శాఖ ఆధర్యంలో ఈనెల 20న మ్యాదరిపేటలో ప్రత్యేక ఆధార్ స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేస్తున్నట్లు తపాల శాఖ ఏఎస్పీ రామరావు బుధవారం ఓప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డులో సవరణ, ఫొటో అప్డేట్, అడ్రస్ మార్పు, ఫోన్ నెంబర్ లింకు డేటా అప్ బర్త్‌లో మార్పులు చేర్పులు తదితర సవరణలు ప్రత్యేక ఆధార్ క్యాంపులో సరిచేసుకోవచ్చన్నారు. మ్యాదరిపేట సమీప గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

పైపులైన్ లీకేజీతో వరి పంటకు నష్టం

కాసిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సోనాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని శివారు ప్రాంతంలో మిషన్ భగీరధ పైపులైన్ లీకేజీ కావడంతో కోతకు వచ్చిన వరి పంట తడిసి నష్టపోతున్నామని రైతులు కనకమారు, చాకటి జైతు, కనక సత్యానారాయణాలు ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల నుంచి మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరంతా వృధాగా పోతుంది. వృధాగా పోతున్న నీరు కాలువ గుండా వచ్చి ఎండిన వరి పొలంలోకి చేరడంతో వరి పంట తడిసి ముద్ద అవుతుందన్నారు. సంబంధిత అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నీరు లీకేజీ కాకుండా మరమ్మతులు చేయాలని కోరారు.

కొండెక్కిన కూరగాయలు

- ఆకాశాన్నంటుతున్న ధరలు
- ఏది కొనాలన్నా కిలో రూ. 100
- పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం



కూరగాయల	ధరలు (కిలో రూ)
టమాట	100
పచ్చిమిర్చి	100
చిక్కుడు	100
అనుపకాయ	100
బీరకాయ	80
బెండకాయ	80
కొత్తిమీర	160
పాలకూర	120
తోటకూర	100
సోరకాయ	100
కాలీ ఫ్లవర్	80
క్యాబేజీ	50
దొండ	80
అలసంద	80
క్యారెట్	70
క్యాప్సికం	80

మంచిర్యాల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. కొద్ది రోజులుగా కూరగాయల రేట్లు ఆకాశాన్నంటుతుం డటంతో పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారం పడుతోంది. పైగా కార్తీక మాసం కావడంతో మాంసాహార ప్రియులు కూడా దానికి దూరంగా ఉంటూ, కూరగాయలతో వండిన ఆహారంపైనే ఆధార పడుతారు. దీంతో సాధారణ రోజుల కంటే ఈ మాసంలో కూరగాయల ధరలు సహజంగానే పెరిగిపోతుం టాయని వ్యాపారులు సైతం చెబుతున్నారు. రూ. 200తో మార్కెట్‌కు వెళితే మూడు రోజులకు.. (తరువాయి 7లో)

ఏం కొనేటట్లు లేదు...

నరెడ్ల రజిత, మంచిర్యాల



మార్కెట్లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. ఏం కొనాలన్నా కిలో రూ. 100కు తక్కువ లేదు. వారానికి సరిపడా కొనాలంటే రూ. 400 వరకు వెచ్చించాల్సి వస్తోంది. కార్తీక మాసంతో పాటు అయ్యప్ప దీక్షా సమయం కావడంతో కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.

నాలుగు నెలలుగా ఇదే పరిస్థితి..

: భాను చందర్, మంచిర్యాల



కూరగాయల ధరలు విపరీతంగా ఉన్నాయి. నాలుగు నెలలుగా కొంచం అటూ ఇటుగా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. దీంతో కిలోల చొప్పున కొనుగోలు చేసే వాళ్లు కూడా అరకిలోతో సరిపెడుతున్నారు. నిత్యం ఇంట్లో ఉండాల్సిన టమాట, పచ్చిమిర్చి ధరలు కూడా కిలో రూ. 100 కంటే తక్కువ ఉండటం లేదు. పేద, మధ్యతరగతి ప్రజలకు ధరలు భారంగా మారాయి.

స్కూల్ యూనిఫాంతో.. జాతీయస్థాయి విద్యా శిక్షణకు



శిక్షణకు విద్యార్థి యూనిఫాంలో హాజరైన ఉపాధ్యాయుడు బుచ్చన్న

దండేపల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సాంస్కృతిక వనరుల శిక్షణ కేంద్రం (సీసీఆర్‌టి)లో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి విద్యా శిక్షణకు దండేపల్లి మండలం గుడి రేవు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బొలిశెట్టి బుచ్చన్న తెలంగాణ విద్యార్థుల ఏక రూప దుస్తులతో హాజరయ్యాడు. విద్యార్థుల స్కూల్ యూనిఫాంతో హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బుచ్చన్నను సీసీఆర్‌టి ఢిల్లీ చైర్మన్ డాక్టర్ వినోద్ నారాయణ్ ఇందూ ర్కర్ అభినందించారు. సీసీఆర్‌టీ చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ ఉపాధ్యాయుడు విద్యార్థుల ఏకరూప దుస్తులతో శిక్షణకు రావడం అభినందనీయమన్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ప్రతి అంశాలను విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో చక్కటి విద్య బోధన అందించి విద్యార్థులందరినీ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు.

గర్భిణులకు సీమంతం

లక్షెట్టిపేట, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు మహిళ ఇన్‌చార్జి వీరమల్ల రోజారాణి మాట్లాడుతూ భగవాన్ స్వరూపుడైన శ్రీసత్యసాయి బాబా జయంతిలో భాగంగా మహిళ విభాగం ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు చేయడంతో పాటు భజన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ ఏటా జయంతి సందర్భంగా ప్రతీ రోజు నగర సంకీర్తనతో పాటు ప్రత్యేక భజనలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి, మహిళ సభ్యులు వసంత, కవిత, సుమతి, శివలీల, ఉమ, శారద, లత సేవా సమితి సభ్యులు గంప రవీందర్, రమేష్, నగధర్, సుదాకర్, మురళి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగిల్ విండో చైర్మన్ల పదవీ కాలం పొడిగింపు



సింగిల్ విండో చైర్మన్లకు ఉత్తర్వులు అందిస్తున్న జిల్లా కో ఆపరేటివ్ అధికారి సత్యనారాయణ

చెన్నూరు/కోటపల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలక వర్గాలకు కోర్టు నుంచి ఊరట లభించింది. ఇటీవల ప్రభుత్వం రద్దు చేసిన జైపూర్, చెన్నూరు, కోటపల్లి, మందమర్రి సహకార సంఘాల పాలక వర్గాలను ఎన్నికలు పూర్తయ్యేంత వరకు యధావిధిగా కొనసాగించాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పు మేరకు బుధవారం జిల్లా సహకార అధికారి సత్యనారాయణ చైర్మన్‌లకు అధికారిక ప్రొసీడింగ్స్ అందజేశారు. జైపూర్ పీఏసీఎస్ చైర్మన్ గుండు తిరుపతి, చెన్నూరు చైర్మన్ చల్ల రాంరెడ్డి, కోటపల్లి చైర్మన్ సాంబ గౌడ్, మందమర్రి చైర్మన్ ప్రభాకర్‌రావులు ప్రొసీడింగ్ పత్రాలను స్వీకరించారు.

మంత్రిని కలిసిన యాదవ సంఘం అధ్యక్షుడు



మంత్రిని సన్మానిస్తున్న యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బండి సదానందం

మందమర్రిటౌన్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన గనుల శాఖ మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి అఖిలభారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సీనియర్ కాంగ్రెస్ నాయకులు బండి సదానందం యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం చెన్నూర్ క్యాంప్ కార్యాలయంలో కలిసి శాలువాతో సత్కరించారు. జిల్లాలో త్వరలోనే యాదవ మహాసభ ఏర్పాటు చేయ బోతున్నామని ఈ సభకు తప్పకుండా హాజరుకావాలని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తామని చెప్పడం వల్ల మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు భారంగా
వరి కోతలు..
చైన్ హార్వెస్టర్లకు పెరిగిన డిమాండ్ 7



సైబర్ నేరాలపై ఉక్కుపాదం
- పలు కేసుల్లో పోలీసులకు పట్టుబడ్డ అంతర్రాష్ట్ర ముఠా
- ఆన్‌లైన్ ట్రేడింగ్, లోన్ యాప్స్‌తో కోట్లు మాయం
6

జిల్లా వ్యాప్తంగా ఇందిరాగాంధీ జయంతి 7

అన్ని వర్గాల సంక్షేమానికి కృషి :మంత్రి వివేక్



కిష్టంపేటలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి, కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కిష్టంపేట గ్రామంలోని రైతు వేదికలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల అభివృద్ధి, సంక్షేమం కోసం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా గడిచిన రెండు సంవత్సరాల్లో మహిళలకు 8 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. మహిళలు ఆర్థిక స్వాలంబన పొందే దిశగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టి అమలు చేస్తుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. అధికారులు అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కార్తీక సందడి



సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహిస్తున్న భక్తులు

దండేపల్లి నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాస సందడి బుధవారంతో ముగియడంతో దండేపల్లి మండలం శ్రీసత్యనారాయణ స్వామి దేవాలయంలో భక్తుల రద్దీ పెరిగింది. భక్తులు కుటుంబ సమేతంగా సత్యదేవుడిని దర్శించుకున్నారు. పవిత్ర గోదావరినదిలో పుణ్య స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజల నడుమ గోదావరి నదిలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకొని సత్యదేవున్ని దర్శించుకొని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వందలాది మంది భక్తులు శ్రీసత్యనారాయణ స్వామి వ్రతాలను నోముకున్నారు.

చలో ఢిల్లీ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు అవిష్కరిస్తున్న నాయకులు

జన్నారం,నవంబరు19 (ఆంధ్రజ్యోతి):రాజ్యాంగ హక్కుల సాధన ఢిల్లీలో ఈ నెల 26న రాజ్యాంగ ఆమోదం దినోత్సవం సందర్భంగా మహాసభ విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద జాతీయ మాలమహానాడు రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బందెల బెంజిమెన్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో దళితుల ఆత్మగౌరవ సభ ఢిల్లీలో నిర్వహిస్తున్నామని దీనికి గ్రామస్థాయిలో తరలిరావాలని పిలుపునిచ్చారు. నవంబరు 26న జరిగే ఈ సభకు ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన 99 రోస్టర్ విధానాన్ని తిరిగి పునఃసమీక్షించాలని, దీనితో పాటు 12 డిమాండ్లతో ఈ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మెండే దేవేందర్, నాయకులు అప్పాసుల దేవయ్య, రాజారావు, నర్సయ్య, తిరుపతి, శంకర్, అమృతరావు, రాజన్న, నరేశ్, రాజారాం, ప్రభాకర్, గంగన్న, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకే ఇసుక

మంత్రి వివేక్‌వెంకటస్వామి



బావురావుపేటలో శాండ్ బజార్‌ను ప్రారంభిస్తున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బావురావు పేటలో ఏర్పాటు శాండ్ బజార్ ద్వారా ప్రజలకు తక్కువ ధరకే ఇసుక అందుతుందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. బుధవారం బావురావుపేటలో టీజీఎండీసీ ద్వారా ఏర్పాటు చేసిన శాండ్ బజార్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నూతనంగా ఏర్పాటు చేసిన శాండ్ బజార్ ద్వారా తక్కువ ధరకే ఇసుక అందుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి ర్మాణ పనులు చేపడుతున్న ప్రజలకు ఇసుక లభ్యతను సులభతరం చేయడం, అక్రమ రవాణాను అరికట్టడం దీని ఉద్దేశ్యమన్నారు. గత ప్రభుత్వ హయాంలో బీఆర్ఎస్ లీడర్లు ప్రజల సొమ్మును దోపిడి చేశారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అక్రమ ఇసుక దందాను అరికట్టామన్నారు. సీఎం తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మైనింగ్ శాఖ ద్వారా గత ఏడాది కంటే ఈ ఏడాది 18 శాతం అధికంగా పన్నులు వసూలు చేశామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కుమార్‌దీపక్, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలి

డీపీవో వెంకటేశ్వర్‌రావు



ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేస్తున్న వెంకటేశ్వర్‌రావు

జైపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అందుబాటులో ఉన్న పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మల్టీ పర్పసర్ వర్కర్లను వార్డుల వారీగా విభజించి తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. గ్రామాల్లోని వీధుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా చూడాలని, సెగ్రిగేషన్‌షెడ్డులో వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. ఇంటి పన్నుల వసూళ్లలో మండలం 29 శాతం ఉన్నందున ఈ నెల 25లోగా వంద శాతం పన్నులను వసూలు చేయాలని లేకుంటే తగు చర్యలుతీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీపతి బాపురావు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

మందమర్రిటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : సింగరేణి ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం బుధవారం హైద్రాబాద్‌లోని సింగరేణి భవన్ ముట్టడికి వెళ్లిన ఎమ్మెల్సీ జాగృతి అధ్యక్షురాలు కవిత, హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్‌తో నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని హెచ్ఎంఎస్ డిప్యూటి ప్రధాన కార్యదర్శి వెల్డి సుదర్శన్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల సొంతింటి కల నెరవేర్చాలని, మెడికల్ బోర్డు ఏర్పాటు చేయాలని, విజిలెన్స్ వేధింపులు మానుకోవాలని, పెరిక్స్‌పై ఇన్‌కంట్యాక్స్ యాజమాన్యం చెల్లించాలని, 150 మస్టర్ల సర్క్యూలర్‌ను రద్దు చేయాలని ఆందోళనలు చేపడితే ప్రభుత్వం అరెస్టులు చేయించడం దారుణమన్నారు. ప్రతియేటా యాజమాన్యం నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అధిగమిస్తూ సంస్థకు లాభాలు ఆర్జించి పెడుతున్న ఉద్యోగుల పరిస్థితి దయనీయ స్థితిలో ఉందన్నారు. పాలక వర్గాలు, యాజమాన్యం ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అరెస్టులను అందరు ఖండించాలన్నారు. సింగరేణి ఉద్యోగుల న్యాయమైన హక్కుల కోసం తమ యూనియన్ పోరాటాలు చేస్తుందన్నారు. నాయకులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ పట్టణ కమిటీ ఎన్నిక

మంచిర్యాల కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ పట్టణ నూతన కమిటీని బుధవారం మంచిర్యాలలో జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు సికిందర్‌ల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. పట్టణాధ్యక్షునిగా అంజిపటేల్, ఉపాధ్యక్షునిగా వంశీ, ప్రధాన కార్యదర్శిగా కార్తీక్, సహాయ కార్యదర్శిగా సాయి, కోశాధికారిగా శంకర్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పెట్టాలని, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాహుల్, అంజి, అనిల్, సింధు, నవ్య, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

సర్కారుకు కుచ్చుటోపీ..

- రైతుల ధాన్యం నేరుగా కొంటున్న మిల్లర్లు.. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చినట్లు ట్రక్ షీట్లు
- మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కుమ్మక్కు



హాజీపూర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జైపూర్ మండలంలోని నర్సింగాపూర్‌లో కొనుగోలు కేంద్రాల నిర్వహకుడు, రైస్ మిల్లర్ కలిసి ఇతర రాష్ట్రాల ధాన్యం ఇక్కడ కొనుగోలు చేసినట్లు కోట్లలో అవినీతి జరిగిన విషయం తెలిసిందే. హాజీ పూర్ మండలంలో రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కుమ్మకై సర్కారునే బురిడి కొట్టిస్తున్న వైనం తాజాగా బయటపడింది. ఇక్కడి ధాన్యాన్ని రైతుల నుంచి నేరుగా తక్కువ ధరకు కొని కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసినట్లు ట్రక్ షీట్లు, రైతులకు ఓటీపీ రావడం అంతా సజావుగా సాగింది. కోట్ల రూపాయల సర్కారు సొమ్ములో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు యజమానులు, రైస్ మిల్లర్లు పంచుకున్నారనే అభియోగాలు ఉన్నాయి.



సబ్బెపల్లి రైస్ మిల్లులో నేరుగా ట్రాక్టర్‌తో తూకం

దగా పడుతున్న రైతు...

గతంలో, ప్రస్తుతం వరి కోతల సమ యానికి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. దీంతో రైస్ మిల్లర్లు భారీ కుట్రకు తెరలేపారు. అసలే వాతావరణ పరి స్థితులు రోజు రోజుకూ మారుతున్నాయి. ఏ క్షణాన వర్షం కురిసేది అర్థం కానీ పరిస్థితిలో వరి రైతుల పొలాలు కోసి కొనుగోలు కేం ద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రైవేటుగా రైస్ మిల్లర్లకు ధాన్యాన్ని అమ్ముకుంటున్నారు. ఏ-గ్రేడ్ వరి ధాన్యా నికి అంటే 1010 సన్న రకానికి ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ. 2389 ఉంది. ఇందులో సన్నాలకు రూ. 500 బోనస్ ఇస్తుంది ప్రభుత్వం. ఇక బీ-గ్రేడ్ రకానికి రూ. 2369 ఉండగా రైస్ మిల్లర్లు కేవలం క్వింటాలుకు రూ.1750, 1850 మధ్యనే కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ. 600 వరకు రైతులు నష్టపోతున్నారు రైతులు

ఓటీపీ చెప్పాకనే డబ్బులిచ్చారు..

చంద్రన్న,రాపల్లి, రైతు

నేను గత రెండేళ్లుగా కోత సమయంలో వర్షాలు వుండడం, కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో రైస్ మిల్లుకే అమ్ముతున్న. ఈ సారి కూడా ముందే కోత కోసిన మొదట క్వింటాలుకు రూ.1870 అని చెప్పి ఇప్పుడు డబ్బులు అడిగితే రూ.1830 ఇస్తా అంటున్నారు. గతంలో కూడా ధాన్యం పోస్తే డబ్బులు అడిగితే పట్టా పాస్ బుక్, బ్యాంక్ బుక్,ఆధార్ ఇవ్వమన్నారు. ఓటీపీ చెప్పినంక కొద్ది రోజులకు డబ్బులు పడ్డాయి.

రైతులు ప్రైవేట్‌ను ఆశ్రయించద్దు..

బ్రహ్మారావు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

జిల్లాలో ఈ ఖరీఫ్‌కు సంబంధించి 317 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సిద్ధం చేశాము. ఇందులో సగం వరకు ఓపెన్ చేశాము. రైతులు తొందరపడి ప్రైవేట్‌కు అమ్ము కోవద్దు. కొనుగోళ్లలో ఏమైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురావాలి.

రైతు పేరు చెప్పి సర్కారును కోట్లల్లో బురిడి కొట్టిస్తున్నారు మిల్లర్లు. రైతు వద్ద తుట్టికి పావుషేరు చొప్పున కొనుగోలు చేసిన ధాన్యాన్ని కొనుగో లు కేంద్రాల్లో కొనుగోలు చేసినట్లు రైస్ మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టర్లతో కుమ్మకై కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును కాజేస్తున్నారు. హాజీపూర్ మండలం సబ్బెపల్లి శివారు రైస్ మిల్లులో ధాన్యం పోసిన రైతులకు ఒప్పందం ప్రకారం డబ్బు చెల్లించకపోవడం, తిరిగి పట్టా పాస్‌బుక్, బ్యాంక్ బుక్, ఆధార్, ఇతర వివరాలు అడగడంతో ఈ తతంగం బయటపడింది. ఈ రైస్ మిల్లుకు సమీపంలోని కొనుగోలు కేంద్రాల

సర్కారుకు ఎగనామం..

నిర్వాహకులు ఈ అవినీతిలో రైస్ మిల్లర్లకు సహకరించినట్లు తెలుస్తోంది. మండలంలో మొత్తంగా మూడు రైస్ మిల్లులో సర్కారును బురిడి కొట్టించినట్లు తెలుస్తోంది. కోట్ల రూపాయలు చేతులు మారినట్లు విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మంచిర్యాల నియోజకవర్గంలో మహిళా సంఘాలకు కొనుగోలు బాధ్యతలు అప్పగించారు. కానీ మహిళల ప్రమేయం లేకుండా వారి భర్తలు, ఇతర కుటుంబ సభ్యులు ఈ కొనుగో ళ్లలో కలగ జేసుకుంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కలెక్టర్ ఈ తతం గంపై లోతైన విచారణ చేస్తే నాలుగేళ్లుగా జరుగుతున్న అవినీతి అక్రమ దందాపై విస్తుపోయే నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.